# 'సాంసంగ్' దోపిడీ

# కార్మికుల రక్తాన్ని జుర్రుకునే పెట్టుబడిదారీ వ్యవస్థ

**పెట్టుబడిదారీ** విధానం – ప్రత్యేకించి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ రూపమైన నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం తన సూపర్ లాభార్జనలను మరింత పెంపుజేసుకునేందుకు కార్మికవర్గ రక్తాన్ని జుర్రుకుంటుందనటం ఏమాత్రం అతిశయోక్తి కాకపోగా, నిరాకరించ వీలులేని వాస్తవం కూడా. బడాపెట్టుబడిదారుల బహుళజాతి కార్పొరేషన్లు తమ సూపర్ లాభాల కోసం పెట్టుబడిదారీ ఉత్పత్తి బలివితర్దిపై కార్మికవర్గ ప్రాణాలను బలిచేస్తూ, వారి రక్తాన్ని జుర్రుకుంటున్నారనే దానికి ఇటీవలి తాజా ఉదాహరణ–దోపిడీదారుల అమానవీయ వర్గ స్వభావాన్ని వెల్లడిచేస్తోంది.

సాంసంగ్ ఎలక్ట్రానిక్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ ఫోన్ల మరియు ఛిప్‌ల తయారీ పరిశ్రమ. దక్షిణకొరియా ఆర్థికవ్యవస్థపై ఆధిపత్యం చేస్తోన్న అదిపెద్ద కుటుంబాలు అదుపులోని సంఘటితసంస్థ అయిన సాంసంగ్ సమూహపు కంపెనీలలో ప్రధానమైనది సాంసంగ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ.

ప్రస్తుతం సాంసంగ్ పరిశ్రమ విస్తృతంగా సెమీకండక్టర్ సమ్మేళనాలను సువాన్‌లోను అదేవిధంగా హవాసియాంగ్, పెయాంగ్‌టాక్, సియోల్ దక్షిణభాగంలో అలాగే చైనాలోని గ్జియాన్‌లోనూ నిర్వహిస్తోంది. సెమీకండక్టర్ మరియు ఎల్ఇడి ఫ్యాక్టరీలలో కార్మికులు తాము తీవ్రమైన క్యాన్సర్‌వంటి పలు రకాల తీవ్రమైన అరుదైన జబ్బులతో గర్భవిచ్చిత్తులతోసహా, పుట్టుకతో సంక్రమించే అనేక జబ్బులతో తమ బిడ్డలు కూడా బాధపడుతున్నారని ఒక దశాబ్దం పైగా కాలంనుండీ ఫిర్యాదుచేస్తూ వస్తున్నారు. 1984 సం॥ నుండీ కార్మికులు ఈ ఫ్యాక్టరీలలో శ్రమ చేస్తూవస్తున్నారు.

సువాన్‌లోని సెమీకండక్టర్ మరియు డిస్‌ప్లే పరిశ్రమల్లో గతంలో పనిచేసిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు–అక్కడి సిబ్బందికి జబ్బు గుర్తింపబడి, భిన్న రూపాలలోని క్యాన్సర్‌తో మరణించారని ఫిర్యాదు చేస్తూవచ్చారు. అయితే తమ పరిశ్రమల్లో అలాంటి ప్రాణ ప్రమాద ఆరోపణలకు అవకాశమే లేదంటూ, కంపెనీ యాజమాన్యం ఆ ఆరోపణలను నిరాకరించింది. తద్వారా కార్మికుల పట్ల తన జవాబుదారీ తనాన్నుండి, వారి మరణాలపట్ల తన బాధ్యత నుండి తప్పించుకోజూసింది.

ఏమైనా, చివరికి ఒక కార్మికురాలి తండ్రి, 2007లో తన బిడ్డ రక్తక్యాన్సర్‌తో మరణించిన విషయంపై న్యాయస్థానంలో సాంసంగ్‌కు వ్యతిరేకంగా వ్యాజ్యం నడిపాడు. న్యాయస్థానాలు ఎన్నో విచారణలు, ఆదేశాలు, నిర్ణయాలు చేస్తూ అంతిమంగా దక్షిణకొరియా కార్మిక సంక్షేమశాఖ మరియు ఓ మధ్యవర్తిత్వ కమిటీల జోక్యంతో 10 సం॥ల తర్వాతనైనా ఒక పరిష్కారానికి రాగలిగింది. వైకల్యం సంభవించిన మాజీ ఉద్యోగులకు నష్టపరిహారం చెల్లించేందుకు సాంసంగ్ యాజమాన్యం ఓ సర్దుబాటు ఒప్పందానికి అంగీకరించింది.

ఈ ఒప్పందం ప్రకారం ఉద్యోగుల సమూహ నష్టపరిహారాన్ని, ఒక్కో కేసుకు 150 మిలియన్ల వన్‌లు (1,33,000 డాలర్లు) సాంసంగ్ చెల్లించాలి. 16 రకాల క్యాన్సర్ వ్యాధులు, మరికొన్ని ఇతర జబ్బులు, గర్భ విచ్ఛిత్తులు, కార్మికుల పిల్లలకు పుట్టుకతో సంభవించిన వ్యాధులవంటివి ఈ పరిధిలోకి వస్తాయి.

సాంసంగ్ సెమీ కండక్టర్ మరియు డిస్‌ప్లే ఫ్యాక్టరీలలో ఉద్యోగం చేసిన వారిలో 240 మందికిపైగా కార్మికులు, సిబ్బంది పనికి సంబంధించిన జబ్బులతో బాధపడ్డారని అంచనా వేశారు. చివరకు సాంసంగ్ యాజమాన్యం తమ సెమీకండక్టర్ మరియు ఎల్ఇడి ఫ్యాక్టరీలలో సంభవించే ఆరోగ్య ప్రమాదాలను నివారించే విధంగా సరైన విధంగా నిర్వహణ చేయటంలో విఫలమయ్యాయని అంగీకరించింది.

తన ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులను పని సంబంధిత ప్రమాదాలనుండి, ఆరోగ్య విపత్తుల నుండి రక్షించలేకపోయినందున, ఘోరమైన నిర్లక్ష్యం వహించటమనే శిక్షార్హమైన నేరంలో సాంసంగ్ చిక్కుకునివుండటంతో, ఇప్పుడొక పెద్ద మనిషిలాగా పోజుపెడుతూ, పది సంవత్సరాల తర్వాత "జబ్బులతో చనిపోయిన, బాధపడిన కార్మికుల కుటుంబాలను మేము నిజాయితీగా క్షమాపణ కోరుతున్నామని" ప్రకటించారు.

బాధితులైన కార్మికుల కుటుంబాలకు ఈ క్షమాపణ ఎలాంటి సాంత్వననూ చేకూర్చబోదు. వారు పొందిన అవమానాలు, గాయాలు, ఆవేదనను మరణించిన కార్మికురాలి తండ్రి పేర్కొన్నవిధంగా కుటుంబ సభ్యులలో ఒకరిని కోల్పోవటాన్ని ఈ నష్టపరిహారం ఏవిధంగానూ భర్తీచేయలేదు.

80 మందికిపైగా యువతులైన మహిళా కార్మికులు క్యాన్సర్‌తో పోరాడుతూ చనిపోతున్నారు.

సాంసంగ్ యాజమాన్యం అడిగిన క్షమాపణ ఏమాత్రం నిజాయితీతోగానీ, చిత్తశుద్ధితోగానీ కూడుకున్నది కాదు; కార్మికుల కళ్ళనీళ్ళు తుడవటంతోపాటు ప్రపంచాన్ని మోసగించే ప్రయత్నమేగాక, తన సూపర్ లాభార్జనలకోసం కార్మికులను దోపిడీచేస్తూ, రక్తాన్ని జుర్రుకొనే తమ అమానవీయ చర్యలను దాచిపెట్టి, కార్మికులకు వ్యతిరేకంగా తాను సాగించే నీచమైన నేరాల నుండి విముక్తంగావాలనే ప్రయత్నమే ఇది!

ఇప్పటికి కూడా సాంసంగ్ యాజమాన్యం తమ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులను ఆరోగ్య విపత్తులనుండి, పనిసంబంధిత ఆరోగ్య ముప్పుల నుండి రక్షించేందుకు అవసరమైన తక్షణ చర్యలనైనా తీసుకోబోతున్నట్లుగా కనీసం ప్రకటించలేదు. ఇదేతరహా క్రీడను సాంసంగ్ ఆడబోతున్నట్లుగా వుంది. తిరిగి మరోసారి పట్టుబడితే ఇదే నాటకాన్ని తిరిగి ఆడేందుకు, కొద్దిపాటి నష్టపరిహారాన్నో లేక మరోదాన్నో ఇచ్చి చేతులు దులుపుకోదల్చుకుంది. కార్మికులకు భద్రమైన, ఆరోగ్యకరమైన పనిప్రదేశ పరిసరాలను కల్పించి దానిని సక్రమంగా నిర్వహించటంకంటే, చౌకగా వుండే ఏదో ఒక మార్గాన్నే యాజమాన్యం ఎంచుకోదలుచుకుంది.

తమ సరుకుల ఉత్పత్తికోసం కార్మికులను, కార్మికవర్గాన్ని బలిపెట్టే పెట్టుబడిదారీ పారిశ్రామిక ఉత్పత్తియొక్క రక్తపిశాచ స్వభావం ఇదే తీరుగా వుంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ దుష్టస్వభావం ఇది కాగా, ఈ హేయమైన, క్రూరమైన పెట్టుబడి దారీ వ్యవస్థ మానవజాతి కళ్యాణంకోసం నిలుస్తుందని ఎవరైనాగానీ ఏవిధంగా చెప్పగలుగుతారు?!

పిడికెడుమందిగా వున్న బడాపెట్టుబడిదారుల ప్రయోజనంకోసం కార్మికవర్గ శ్రమశక్తిని క్రూరంగా దోచుకునే ఈ దుష్టవర్గ స్వభావాన్ని కార్మికవర్గం అవగాహన చేసుకోవాలి. అందుకే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను కూకటివేళ్ళతో పెళ్ళగించి దోపిడీ పీడనలు, అసమానతలు లేని సామ్యవాద వ్యవస్థ స్థాపనకోసం పోరాడేందుకు ప్రతినబూనాలి.

0000